


నేడు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ అందజేత

● మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్

ఆమనగల్లు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఇప్పటివరకు ఆమనగల్లు మున్సిపాలిటీకి 360 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్ మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఇల్లు మంజూరై ఇప్పటికీ పనులు ప్రారంభించని వాటి స్థానంలో కొత్తగా 32 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. కొత్తగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు బుధవారం మున్సిపల్ కార్యాలయంలో ప్రొసీడింగ్స్ అందిస్తామని పేర్కొన్నారు.

అందెశ్రీకి కన్నీటి వీడ్కోలు

అధికార లాంఛనాలతో ఘట్‌కేసర్‌లో ముగిసిన అంత్యక్రియలు





అందెశ్రీ అంతిమయాత్రలో పెద్ద సంఖ్యలో అభిమానులు, ప్రజాప్రతినిధులు

- కవులు, కళాకారుల ఆటపాటలతో నివాళి
- హాజరైన సీఎం, మంత్రులు, ప్రజాప్రతినిధులు
- శోకసంద్రంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వాసులు
- కలెక్టర్ మను చౌదరి ఆధ్వర్యంలో ఏర్పాట్లు
- పోలీసుల భారీ బందోబస్తు

సహజ కవి, ప్రముఖ రచయిత అందెశ్రీ.. తాను ఎంతో ఇష్టంతో నిర్మించుకుంటున్న ఇంటిని సందర్శించి 24 గంటలు గడవక ముందే అక్కడికి శవమై తిరిగిరావడాన్ని స్థానికులు ఆయన అభిమానులు జీర్ణించుకోలేకపోయా రు. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్‌లో మంగళ వారం నిర్వహించిన ఆయన అంత్యక్రియలకు పెద్ద సంఖ్యలో ప్రజా ప్రతినిధులు, కవులు, కళాకారులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై నివాళులర్పించారు. అంతిమ యాత్రలో ఆయన అభిమానులు 'అందెశ్రీ అమర్ రహే' అంటూ నినాదాలు చేశారు.



అంతిమ యాత్రలో మంత్రులు జూపల్లి, లక్ష్మణ్

ఘట్‌కేసర్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ ఆకస్మిక మరణం యావత్ రాష్ట్రాన్ని శోకసంద్రంలో ముంచేసింది. అందరితో కలుపుగోలుగా ఉండే ఆయన తిరిగి రాని లోకాలకు వెళ్లాడన్న నిజాన్ని జిల్లా ప్రజలు జీర్ణించుకోలేక పోయారు. పాత వరంగల్ జిల్లాలోని మారుమూల గ్రామం రేబర్తిలో జన్మించిన ఆయన అనేక కష్టనష్టాల కోర్చి జనం గుండెల్లో నిలిచిపోయే విధంగా అనేక గేయాలు, పాటలు రచించి, అందరి మనసులు చూరగొన్నారు. ఇలాంటి గొప్ప వ్యక్తి తమ మధ్యలో లేకపోవడం ఆయన అభిమానులను కలిచివేసింది. ఘట్‌కేసర్‌లోని

మిగతా 7వ పేజీలో...

కడసారి చూపునకు తరలివచ్చి



అందెశ్రీ అంతిమ యాత్రలో కళాకారుల ఆటాపాట

ఎన్ఎఫ్‌సీ నగర్ నుంచి ఘట్‌కేసర్ అవుటర్ జంక్షన్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం పక్కన మంగళవారం నిర్వహించిన అంత్యక్రియలకు జిల్లాలోని కవులు, కళాకారులతో పాటు పార్టీలకతీతంగా రాజకీయ నాయకులు, ఆయన అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో కడసారి చూపుకోసం తరలివచ్చారు. ఆయన అంత్యక్రియలు ఘట్‌కేసర్‌లో నిర్వహించాలని ప్రభుత్వం ప్రకటించిన వెంటనే కలెక్టర్ మను చౌదరి నేతృత్వంలో అధికారులు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. సోమవారం సాయంత్రం నుంచే ఏర్పాట్లను ప్రారంభించి తెల్లవారే సరికి పూర్తి చేశారు. ప్రధానంగా రోడ్లకు ఇరువైపుల చదును చేయటంతో పాటు పలుచోట్ల గుంతలను పూడ్చారు. తీవ్రమైన చలిని సైతం లెక్క చేయకుండా రాత్రికి రాత్రే సిబ్బంది చేసిన శ్రమను పలువురు అభినందించారు.

ఎట్టకేటలకు చెత్త తొలగింపు



జేసీబీతో చెత్తను తొలగిస్తున్న దృశ్యం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కొత్తూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కొత్తూర్ డంపింగ్‌యార్డుపై మున్సిపల్ కమిషనర్ బాలాజీ ఆధ్వర్యంలో సిబ్బంది చర్యలు చేపట్టారు. ఈనెల 9న ప్రచురితమైన 'డేంజర్‌గా డంపింగ్ యార్డు' కథనానికి మున్సిపల్ కమిషనర్ స్పందించారు. మంగళవారం విద్యుత్ తీగల కింద, తిరుపతి ఉద్యోగ్ పరిశ్రమ రోడ్డులో ఇష్టారాజ్యంగా పారబోసిన చెత్తను జేసీబీల సాయంతో ఎత్తి వేయించారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ పారబోస్తే జరిమానాలు విధిస్తామని నోటీస్ బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విద్యుత్ తీగల కింద చెత్తకు నిప్పంటించకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పరిశ్రమల నుంచి వెలువడుతున్న వ్యర్థాలను గుట్టుచప్పుడు కాకుండా పారబోస్తున్నారని, అలాంటి వారిని గుర్తించి జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.



మొండిగౌరెల్లి రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రంగారెడ్డి


అన్నివిధాలా ఆదుకుంటాం

రైతులకు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి భరోసా

యాచారం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పరిహారం విషయమై సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి రైతులందరిని ఆదుకుంటామని, ఈ విషయంలో ఆందోళన చెందొద్దని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో మండలంలోని మొండిగౌరెల్లి రైతులు ఎమ్మెల్యేను కలిసి విన్నవించారు. ప్రభుత్వం అభివృద్ధి పనుల నిమిత్తం సేకరిస్తున్న భూసేకరణ విషయంలో తమకు ఎకరానికి రూ.60 లక్షలతోపాటు 121 గజాల ప్లాట్ అందించాలని, లేకపోతే మా భూములు ఇవ్వమని రైతులు తేల్చిచెప్పారు. భూమినే నమ్ముకొని ఉన్న తమకు అన్యాయం చేయొద్దని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ భూ పరిహారం విషయంలో రైతులకు అన్ని విధాలా న్యాయం చేస్తామని, సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. గతంలో వీఆర్‌వోతో పహాణీలో పేర్లు రాయించుకొని నేడు పరిహారం కోరిన ఏ ఒక్క రైతుకు పరిహారం ఇవ్వరాదని, అసైన్డ్ సర్టిఫికెట్లు, పాస్ బుక్‌లున్న వారికి మాత్రమే పరిహారం అందించాలని రైతులు ఎమ్మెల్యేకు విన్నవించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో రైతులు మేకల యాదగిరిరెడ్డి, తాండ్ర రవీందర్ తదితరులు ఉన్నారు.

పత్తి రైతుకు చిక్కు

కపాస్ కిసాన్ యాప్‌పై అవగాహన కరువు



వర్షాలకు తడవడంతో యాచారంలో చేనులోనే పత్తి

- దళారులను ఆశ్రయిస్తున్న రైతులు
- క్వింటాల్ రూ.6,500కు విక్రయం
- తడిసిన పత్తిని చేను వద్దే కొంటున్న దళారులు

యాచారం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పత్తి రైతులకు పెద్ద చిక్కు వచ్చి పడింది. అన్ని విధాల ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం కపాస్ కిసాన్ యాప్ అందుబాటులోకి తెచ్చినా రైతులకు ప్రయోజనం లేకుండా పోతోంది. యాప్‌పై రైతులకు అవగాహన లేకపోవడంతో దళారులు సొమ్ము చేసుకుంటున్నారు. యాప్‌లో వివరాలను గమనించి, వివరాలు లేని రైతుల చేన్ల వద్దకే వెళ్లి తక్కువ ధరకు పత్తిని కొనుగోలు చేస్తున్నారు.

మద్దతు ధరకు నోచుకోని వైనం

పత్తిలో తేమ శాతం ఎనిమిది ఉంటే రూ.8,110, తొమ్మిది ఉంటే రూ. 8,028, పది ఉంటే రూ.7,947.80, 11 ఉంటే రూ.7,866.70, తేమ శాతం 12 ఉంటే రూ.7,785 చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించినా రైతులు పట్టించుకోవడంలేదు. మద్దతు ధర ఇచ్చినా అడ్డగోలు నిబంధనలతో గిట్టుబాటు కావడం

మిగతా 8వ పేజీలో...



అజాద్‌కు నివాళులర్పిస్తున్న డీఆర్వో సంగీత, తదితరులు

అబుల్ కలాం జీవితం ఆదర్శనీయం

ఇబ్రహీంపట్నం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మౌలానా అబుల్ కలాం ఆజాద్ జీవితం ఆదర్శనీయమని జిల్లా రెవెన్యూ అధికారి సంగీత అన్నారు. అబుల్ కలాం ఆజాద్ 137వ జయంతి సందర్భంగా మంగళవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం భవనంలో మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డీఆర్వో పాల్గొని ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడు, భారత ప్రభుత్వ తొలి విద్యాశాఖ మంత్రిగా ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. ఆయన ప్రఖ్యాత పండితుడు, కవి అని అరబిక్, ఇంగ్లిష్, ఉర్దూ, హిందీ, పర్షియన్, బెంగాలీ భాషల్లో ఆయన ప్రావీణ్యుడని పేర్కొన్నారు. జర్నలిజంలో అపార అనుభవంతో ఉర్దూ పత్రికను నెలకొల్పి సమాజంలోని రుగ్మతను రూపుమాపేందుకు కృషి చేశాడన్నారు. ఆయన జయంతిని విద్యా దినోత్సవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఎయిర్‌పోర్టులో మాక్‌డ్రిల్



శంషాబాద్ రూరల్, నవంబర్ 11 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలోని కారు పార్కింగ్ వద్ద భద్రతా బలగాలు మంగళవారం మాక్ డ్రిల్ నిర్వహించాయి. కారు పార్కింగ్‌లో ఉగ్రవాదులు బాంబు దాడులు జరిపితే ఎలా రక్షించాలనే దానిపై నిర్వహించిన డ్రిల్‌లో సీఐఎస్ఎఫ్, సీఆర్పీఎఫ్, స్థానిక పోలీసులు, రక్షా సిబ్బంది పాల్గొన్నారు. డాగ్, బాంబు స్క్వాడ్‌లతో తనిఖీలు ఎలా నిర్వహించాలి, బాంబులు ఎక్కడ ఉన్నాయి, ఎలా గుర్తించాలి? ప్రమాదంలో గాయపడ్డ వారిని ఎలా రక్షించాలని? అనే విషయాలపై మాక్ డ్రిల్ నిర్వహించారు, ఈ మాక్ డ్రిల్ మధ్యాహ్నం 1.30 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 2.35 ముగిసింది. ఇందులో క్యూఆర్‌టీ 20 మంది, బీడీడీఎస్ ఎనిమిది మంది, కే9 ఇద్దరు, ఏఆర్ఎఫ్ఎఫ్ ఏడుగురు, రక్షా ఐదుగురు, అపోలో ఏఎంసీ ఐదుగురు, జీటీడీ నుంచి ఒక్కరు ఇలా మొత్తం 56 మంది పాల్గొన్నట్లు అధికారులు వెల్లడించారు. సోమవారం ఢిల్లీలో బాంబు పేలుళ్ల నేపథ్యంలో ఈ మాక్ డ్రిల్‌కు ప్రాధాన్యం సంతరించుకుంది. ఎప్పుడైన ఎయిర్‌పోర్టులోని కారు పార్కింగ్‌లో ప్రమాదం జరిగితే ఎలా స్పందించాలనే దాని మాక్ డ్రిల్ నిర్వహించామని అధికారులు వెల్లడించారు.

వణికిస్తున్న చలి

- రోజురోజుకూ పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- చలి గాలుల ఉధృతి
- అత్యల్పంగా యాలాల్‌లో 12 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- రహదారులను కప్పేస్తున్న పొగమంచు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి)

ఉమ్మడి జిల్లాలో చలి విజృంభిస్తోంది. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. సాయంత్రం నుంచే చలిగాలుల ఉధృతి పెరగడంతో రాత్రిళ్లు జనం బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. రాత్రి పూట రోడ్లన్నీ నిర్మానుష్యగా మారుతున్నాయి. తెల్లవారు జామున మంచు విపరీతంగా కురుస్తోంది. ఉదయం వేళ మంచు రహదారులను కప్పేయడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వికారాబాద్ జిల్లా యాలాల్‌లో 12 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే మర్పల్లిలో 12.6 డిగ్రీలు, తాండూరు, బషీరాబాద్‌లలో 13.4 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి సెంట్రల్ యూనివర్సిటీలో 13.4 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. చేవెళ్ల మండలం కందవాడలో 13.7 డిగ్రీలు, షాబాద్ మండలం తాళ్లపల్లిలో 13.8 డిగ్రీలు, చందన్వెల్లిలో 14.0 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే మేడ్చల్ ఇండస్ట్రియల్ ఏరియాలో 14.9 డిగ్రీలు, ఆల్వాల్‌లో 15 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో పగటి ఉష్ణోగ్రతలు కూడా క్రమేపీ పడిపోతున్నాయి. మూడు జిల్లాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు దాదాపు అన్ని మండలాల్లో 28 నుంచి 30 డిగ్రీలలోపుగానే నమోదయ్యాయి. రాబోయే రోజుల్లో చలి తీవ్రత ఇంకా మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

పెరటి కోళ్ల పెంపకంతో ఆర్థిక స్వావలంబన

● డీఆర్‌డీవో శ్రీలత

7

రాష్ట్ర స్థాయి ఖోఖో టోర్నీ విజేత రంగారెడ్డి



అరుణ వర్ణ శోభితం

సంధ్యా సమయం సూర్యుడు అరుణవర్ణ శోభితమై మంత్రముగ్ధులను చేశాడు. ఈ సుందర దృశ్యం యాచారం మండల పరిధిలోని కుర్మిద్ద గ్రామంలో మంగళవారం ఆవిష్కృతమైంది. ఆకాశం ఎర్రగా మారడంతో పాటు నల్లని మేఘాలు కమ్ముకోవడంతో రైతులు కాస్త ఆందోళనకు గురయ్యారు.

- యాచారం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి)

కొమ్మ కొమ్మకో కొంగ

కొమ్మ కొమ్మకో కొంగ వాలి ఆ చెరువుకు కొత్త అందాన్ని తెచ్చాయి. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులు నిండు కుండను తలపిస్తున్నాయి. మంగళవారం కందుకూరు మండల పరిధిలోని కొత్తగూడ సున్నం చెరువులోని తుమ్మ చెట్లపై వందల సంఖ్యలో కొంగలు వాలడంతో చెట్లకు తెల్లని పూలు పూసిన మాదిరిగా అందరినీ ఆకట్టుకున్నాయి.

- కందుకూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి)














వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

నంబర్ ప్లేట్ లేని వాహనాలు నడిపితే చర్యలు

దుద్యాల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే చట్టరీత్యా చర్యలు తప్పవని హెడ్‌కానిస్టేబుల్ యాదయ్య అన్నారు. మంగళవారం దుద్యాల్ స్టేజీ వద్ద పోలీసు సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేశారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనాల అన్ని పత్రాలను కలిగి ఉండాలన్నారు. నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే సీజ్ చేస్తామన్నారు. తనిఖీల్లో 45 నంబర్ ప్లేట్ లేని వాహనాలు, సరైన పత్రాలు లేనివాటిని గుర్తించి కౌన్సిలింగ్ ఇచ్చారు. తనిఖీల్లో పోలీసు సిబ్బంది శంకర్ పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థ బలోపేతానికి పెద్దపీట


దుద్యాల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యా వ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఎక్కచెరువు తండాలో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి కాంగ్రెస్ నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. అన్ని గ్రామాలు, తండాల్లో అంగన్‌వాడీ భవనాలను ప్రభుత్వం నిర్మిస్తుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ వేణుగోపాల్, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, కాంగ్రెస్ మండలాధ్యక్షులు శేఖర్, నర్సిములుగౌడ్, నాయకులు వెంకట్‌రాములుగౌడ్, సీతారాం, పులిందర్ రెడ్డి, మెరుగు వెంకటయ్య, రూప్లనాయక్ తదితరులు పాల్గొన్నారు.


అంగన్‌వాడీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న చైర్మన్ రాజేశ్‌రెడ్డి


















దాడుల్లో భారీగా నల్ల బెల్లం పట్టివేత

● 120 కిలోల బెల్లం, 120 కేజీల పటిక స్వాధీనం

● ఇద్దరు నిందితుల అరెస్టు ● ఆటో, రెండు సెల్‌ఫోన్ల సీజ్



పట్టుబడిన బెల్లం, పటిక, నిందితులతో సీఐ బద్యనాథ్ చౌహాన్, సిబ్బంది

ఆమనగల్లు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సారా, నల్లబెల్లం, మద్యం అక్రమ రవాణాపై ఎక్సైజ్ అధికారులు ఉక్కు పాదం మోపుతున్నారు. ఆమనగల్లు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని ఆమనగల్లు, మాడ్గుల, తలకొండ పల్లి, కడ్తాల మండలాల పరిధిలో దాడులను ముమ్మరం చేశారు. మంగళవారం సీఐ బద్యనాథ్ చౌహాన్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించి పెద్ద ఎత్తున బె ల్లం, పటిక పట్టుకున్నారు. ఆమనగల్లు ఎక్సైజ్ పరిధి గ్రామాలు, నాగర్‌కర్నూ ల్ జిల్లాలోని పలు ప్రాంతాలకు తయారీకి హైద రాబాద్ నుంచి నల్లబెల్లం, పటిక తరలిస్తున్నారన్న సమాచారంతో సీఐ నిఘా ఏర్పాటు చేశారు. కడ్తాల టోల్ ప్లాజా వద్ద వాహనాలను తనిఖీ చేశారు. ఆగి ఉన్న ఆటోను తనిఖీ చేయగా 120 కిలోల నల్లబెల్లం, 120 కిలోల పటిక పట్టుబడిందని ఎక్సైజ్ సీఐ తెలిపారు. ఒక ఆటో, రెండు సెల్‌ఫోన్లను సీజ్ చేసి, బెల్లం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిందితులు ఎం.ప్రవీణ్, ఎం. బీచ్యలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సారా తయా రీ, విక్రయాలను అరికడుతున్నట్టు సీఐ బద్యనాథ్ చెప్పారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ అరుణ్ కుమార్, సిబ్బంది శంకర్, శ్రీను, బాబు, ఆమని పాల్గొన్నారు.

అక్రమ మద్యం ...

ఆదిభట్ల: అక్రమంగా మద్యం తరలిస్తున్న ఓ వ్యక్తిని ఎస్వోటీ పోలీసులు పట్టుకున్న ఘటన ఆదిభట్ల పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై సైదయ్య తెలిపిన వివరాల ప్రకారం.. నాదర్గుల్‌కు చెందిన మాదగోని అశోక్ బెల్టు షాపు విక్రయానికి రూ.25వేలు విలువ చేసే(పది బీర్లు, 38 లీటర్ల ఆఫీసర్ చాయిస్స్ 90ఎంఎల్) మద్యాన్ని ద్విచక్ర వాహనంపై తరలిస్తుడగా మహేశ్వరం ఎస్వోటీ పోలీసులు నాదర్గుల్ సబ్‌స్టేషన్ సమీపంలో పట్టుకున్నారన్నారు. కేసు నమోదు చేశామని తెలిపారు.

42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాల్సిందే..



షాబాద్‌లో దీక్ష చేస్తున్న బీసీ సంఘం నాయకులు

షాబాద్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇచ్చే వరకూ పోరాటం కొనసాగిస్తామని సంఘం నాయకులు మీసాల వెంకటయ్య, మాణిక్యం, రాజలింగం, శ్రీనివాస్ అన్నారు. షాబాద్‌లో చేపట్టిన దీక్ష మంగళవారంతో 31రోజుకు చేరింది. వారు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌గౌడ్, గౌరీశ్వర్, చంద్రయ్య, రమేశ్‌యాదవ్, శ్రీకాంత్, ప్రభాకర్‌గౌడ్, సత్తయ్యజనార్దన్, మాజీద్, అన్వర్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

అనంత పద్మనాభుడి కోడెల వేలం



అనంతగిరిలో కోడె దూడల వేలాన్ని నిర్వహిస్తున్న సిబ్బంది

వికారాబాద్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): అనంతగిరి అనంతపద్మనాభ స్వామి ఆలయంలో మంగళవారం కోడె దూడల వేలాన్ని నిర్వహించారు. కార్తీక మాస పెద్ద జాతర సందర్భంగా స్వామి వారికి భక్తులు మొక్కుబడిగా చెల్లించిన కోడెలను వేలం వేశారు. మొత్తం 11 జతలను వేలానికి పెట్టగా ఐదు జతలను కొత్రేపల్లికి చెందిన జి.కృష్ణయ్య రూ.97వేలకు కొన్నాడు. మూడు జతలను గోదంగూడకు చెందిన జి.శంకరయ్యగౌడ్ రూ.30వేలకు, రెండు జతలను మున్నూర్ సోమారం గ్రామానికి చెందిన టి.రవి రూ.37,500కు, మరో జతను ఇదే గ్రామానికి చెందిన టి.దయాకర్ రూ.30వేలకు తీసుకున్నాడు. వేలం ద్వారా ఆలయానికి రూ.2.32లక్షల ఆదాయమొచ్చిందని ధర్మకర్త ఎన్.పద్మనాభం, ఈవో టి.నరేందర్ తెలిపారు.

లొంక క్షేత్రంలో ప్రత్యేక పూజలు

పరిగి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాళ్లాపూర్ లొంక అంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ గ్రామాల భక్తులు స్వామి వారికి మొక్కులు తీర్చుకున్నారు. ఆట, పాటలతో భజనలు, కోలాట కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిగికి చెందిన డాక్టర్ ప్రదీప్‌కుమార్ దంపతులు అన్నధాన కార్యక్రమాన్ని నిర్వహించారు.



లొంక ఆంజనేయ స్వామి ఆలయంలో భక్తులు

సామాజిక సంక్షేమాన్ని పెంపొందించాలి

● ఒకే వేదికపై ఇన్వెస్టర్లు, ఇనిస్టిట్యూషన్లు

● దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

● బాలవికాస కేంద్రంలో సోషల్ స్టార్టప్ సమ్మిట్ ఇంపల్స్-2025



సోషల్ స్టార్టప్ సమ్మిట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సురేఖ

కీసర, నవవబరు 11(ఆంధ్రజ్యోతి): సమస్యలను రూపుమాపేందుకు సామాజిక వ్యాపార ఆలోచనలు అవసరమని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. నాగారం మున్సిపల్ పరిధి రాంపల్లి దాయర లోని బాల వికాస కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సోషల్ స్టార్టప్ సమ్మిట్ ఇంపల్స్-2025 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆమె హాజరయ్యారు. బాల వికాస వ్యవస్థాపకులు బాల థెరిస్సా అంద్రే జింగ్రాస్‌తో కలిసి సమ్మిట్‌ను ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ఒకే వేదికపైకి సామాజిక వ్యాపార ఆలోచనలు ఉన్నవారిని, ఇన్వెస్టర్లను, వివిధ రంగాల సంస్థలను తీసుకురావడం గొప్ప విషయమన్నారు. సామాజిక సంక్షేమాన్ని పెంపొందించడంలో ప్రతీ ఒక్కరు ముందుండాలన్నారు. పెట్టుబడులకు సహాయ సహకారాలను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. దేశవ్యాప్తంగా 7000 గ్రామాల్లో సామాజిక కార్యక్రమాలతో సేవలందిస్తున్న బాల వికాస కేంద్ర నిర్వాహకులను అభినందించారు. తనకు గత 30ఏళ్లుగా బాల వికాస సంస్థతో మంచి సంబంధం ఉందన్నారు. పరిశ్రమలతో పాటు పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. వన మహోత్సవంలో భాగంగా ప్రభుత్వం 36లక్షల మొక్కలు నాటామన్నారు. అనంతరం పలువురు రూపొందించిన స్టార్టప్‌లను ఆమె పరిశీలించారు.

జాతీయ వాలీబాల్ పోటీలకు నరేశ్ ఎంపిక

పరిగి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో జరుగనున్న అండర్-19 స్కూల్ గేమ్స్ వాలీబాల్ పోటీలకు పరిగి విద్యార్థి ఎంపికయ్యాడు. పరిగిలోని గురుకుల పాఠశాల విద్యార్థి డి.నరేశ్ ఇటీవల యాదాద్రి భువనగిరిలో జరిగిన అంతర్ జిల్లా పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి టీంకు ఎంపికయ్యాడు. ఈ నెల 13 నుంచి 17 వరకు మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటాడు. నరేశ్‌ను ప్రిన్సిపాల్ థామస్‌రెడ్డి, పీడీ శ్రీధర్‌రెడ్డి, టీచర్లు అభినందించారు.



ట్రోఫీతో నరేశ్

రైల్వే స్టేషన్, బస్టాండ్‌లలో తనిఖీలు



రైల్వే స్టేషన్‌లో తనిఖీలు

వికారాబాద్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి):రద్దీ ప్రదేశాల్లో పోలీసులు తనిఖీలు చేపట్టారు. మంగళవారం ఎస్పీ ఆదేశాల మేరకు బాంబ్, డాగ్ స్క్వాడ్ బృందాలు వికారాబాద్ రైల్వేస్టేషన్, బస్టాండ్‌లలో తనిఖీలు చేశారు. ప్రజలతో మాట్లాడుతూ.. అనుమానిత వస్తువులుగానీ, వ్యక్తులుగానీ కన్పిస్తే వెంటనే పోలీస్ స్టేషన్‌కు గానీ లేదా డయల్ 100కు గానీ సమాచారం ఇవ్వాలని కోరారు.



బస్టాండ్‌లో..

రాష్ట్ర స్థాయి ఖోఖో టోర్నీ విజేత రంగారెడ్డి

● ఉమ్మడి జిల్లా జట్టు రికార్డు



రాష్ట్ర స్థాయి సీనియర్ ఖోఖో క్రీడాపోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు

శామీర్‌పేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయిలో నిర్వహించిన ఖోఖో పోటీల్లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు ప్రాతినిధ్యం వహించిన తూంకుంట క్రీడాకారులు ప్రథమ స్థానంలో నిలిచి రికార్డు సృష్టించారు. ఈ క్రీడా పోటీలు, విజేతల వివరాలను మంగళవారం ఉమ్మడి జిల్లా ఖోఖో సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాస్‌యాదవ్ వెల్లడించారు. ఈ నెల నవంబరు 7 నుంచి 9వ తేదీ వరకు పెద్దపల్లిలో రాష్ట్రస్థాయి 58వ సీనియర్ ఖోఖో టోర్నమెంట్ పోటీలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా జట్టు మూడు రోజుల పాటు హోరాహోరీగా తలపడ్డారు. పోటీల్లో ఉమ్మడి జిల్లా పురుష క్రీడాకారుల ప్రథమ స్థానంలో, మహిళల జట్టు ద్వితీయ స్థానంలో నిలిచి రికార్డు సృష్టించారు. ఉమ్మడి రంగారెడ్డి తరపున తూంకుంటకు చెందిన జైహింద్ ఖోఖో క్లబ్ నుంచి 8 మంది పురుష క్రీడాకారులు, ఒక క్రీడాకారిణి పాల్గొన్నారు. ఇటీవల తూంకుంటలో 10 రోజుల పాటు క్రీడాకారులకు నిర్వహించిన శిక్షణ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో విజయానికి దోహదపడిందని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు.

విజేతలను అభినందించిన ఆర్గనైజర్లు, తల్లిదండ్రులు

కాగా రాష్ట్ర స్థాయిలో జరిగిన ఖోఖో క్రీడాపోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన తూంకుంట జైహింద్ ఖోఖో క్లబ్‌కు చెందిన క్రీడాకారులను పలువురు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఖోఖో సంఘం ఉపాధ్యక్షుడు, కోచ్ గుర్రం సత్తిరెడ్డి, ఉమ్మడి జిల్లా ఖోఖో సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాస్‌యాదవ్, తూంకుంట జెడ్పీ పాఠశాల హెచ్ఎం వెంకట్‌రెడ్డి, ఉమ్మడి శామీర్‌పేట యూటీఎఫ్ అధ్యక్షుడు తిరుమలేశ్, రాష్ట్ర స్థాయి సీనియర్ క్రీడాకారులు రఘువర్ధన్‌గౌడ్, సందీప్‌గౌడ్, వినోద్‌కుమార్, సోమేశ్, తదితర క్రీడాకారులు అభినందించారు.

రైతులపై కేసులను ఎత్తివేయాలి



నిరసన తెలుపుతున్న ప్రజలు, నాయకులు

దుద్యాల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రైతులపై కేసులను ఎత్తివేయాలని కొడంగల్ నియోజకవర్గ దుద్యాల మండలం లగచర్లలో మంగళవారం వివిధ గ్రామాల ప్రజలు, నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత సంవత్సరం 11న కలెక్టర్ ఇతర అధికారులపై జరిగిన దాడి నేపథ్యంలో హకీంపేట, లగచర్ల, పులిచర్ల,రోటిబండ తండాలు, పోలెపల్లి గ్రామాలకు చెందిన 72 మంది రైతులపై, మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డిలపై కేసుల నమోదుతో రైతులు బాధల్లో ఉన్నారన్నారు. కలెక్టరే తనపై దాడి జరగలేదని, దాడి అనే పదాన్నే వాడొద్దని చెప్పినా ప్రభుత్వం రైతులపై కేసులు నమోదు చేయించిందని ఆరోపించారు. రైతులను, మహిళా రైతులను చూడకుండా పోలీస్‌స్టేషన్‌ల చుట్టు తిప్పడం సరైంది కాదన్నారు. ఇండస్ట్రీయల్ కారిడార్ కోసం అధికారులు భూములు సేకరించడం జరిగిందని, కానీ కొంత మంది ఎస్టీ రైతులు, రైతులు భూములు ఇవ్వకుండా న్యాయం కోసం పోరాటం చేస్తున్నారన్నారు. భూములు ఇవ్వని రైతులను వెంటనే ఇండస్ట్రియల్ కారిడార్ నోటిఫికేషన్ నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా 38 మంది రైతులకు ఇప్పటి వరకు పరిహారం అందలేదన్నారు. హకీంపేట్‌కు చెందిన ర్యాకం యాదయ్యకు చెందిన సర్వే నం.240లో భూమికి జనరల్ అవార్డు ప్రకటించడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో నరేశ్‌గౌడ్, యాదయ్య, బసప్ప, ఎల్‌హెచ్‌పీఎస్ నాయకుడు సూర్యనాయక్, విశాల్, శివకుమార్, కిష్టప్ప, మదరయ్య పాల్గొన్నారు.

తెలంగాణలో పేదరికం పోలేదు

● త్వరలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తా..

● తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత



మాల్‌లో ప్రజలకు అభివాదం చేస్తున్న కవిత

యాచారం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం సిద్ధించినా ఇంకా పేదరిక నిర్మూలన జరగలేదని, రాష్ట్రంలో రాజకీయ శూన్యత నెలకొందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. జాగృతి నిర్వహిస్తున్న జనం బాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆమె మిర్యాలగూడ, నల్గొండ ప్రాంతాలకు వెళ్తుండగా మార్గమధ్యలో మాల్‌లో ఆమెకు జాగృతి కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కవిత మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి వ్యక్తి కృషిచేయాలన్నారు. బీఆర్ఎస్ నుంచి బయటకొచ్చినా తాను నిరుపేద ల కడగండ్లు తీర్చే పోరాటానికి అంకితమైనట్లు వెల్లడించారు. సామాజిక తెలంగాణ నినాదంతో పనిచేస్తున్నట్టు చెప్పారు. త్వరలో తన కార్యాచరణ ప్రకటిస్తానని తెలిపారు. పేదలకు సంక్షేమ పథకాలందేలా ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంజయ్య తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని కలెక్టరేట్ ఎదుట పెన్షనర్ల దీక్ష



కలెక్టరేట్ ఎదుట నిరసన దీక్ష చేస్తున్న పెన్షనర్లు

ఇబ్రహీంపట్నం, నవంబరు11(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలంటూ మంగళవారం కలెక్టరేట్ వద్ద తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు నిరసన దీక్ష చేపట్టారు. అ సోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె.నాగేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణారావు మాట్లాడారు. పెన్షనర్ల సమస్యలను ఎన్నో ఏళ్లుగా పరిష్కరించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. 2024 మార్చి 31తర్వాత రిటైరైన వారితోపాటు అంతకు ముందు విరమణ చేసిన వారిలో కొందరికి పెన్షన్ బెనిఫిట్లు ఇవ్వలేదన్నారు. పైరవీలు చేసుకున్న వారికే బెనిఫిట్లు అందుతున్నాయని ఆరోపించారు. పెన్షనర్లకు ఇచ్చిన హామీ మేరకు ఈహెచ్ఎస్ కార్డులతో నగదు రహిత వైద్యం అందించడం లేదని, వెంటనే ఈ స్కీం అమలుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పెరటి కోళ్ల పెంపకంతో ఆర్థిక స్వావలంబన



మహిళా సంఘాల సభ్యులకు పెరటి కోళ్లను అందజేస్తున్న డీఆర్‌డీవో శ్రీలత

కడ్తాల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పెరటి కోళ్ల పెంపకంతో మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించొచ్చని డీఆర్‌డీవో శ్రీలత అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళా స్వయం సహాయక సంఘాలకు ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా పెరటి కోళ్ల పెంపకం యూనిట్లు అందిస్తున్నట్లు తెలిపారు. కడ్తాల మండలం చల్లంపల్లి గ్రామానికి చెందిన మహిళా సంఘం సభ్యురాలు మారేళ్ల బాలమ్మ రూ.3 లక్షలతో ఏర్పాటు చేసుకున్న రెండు వేల కోడి పిల్లల పెరటి కోళ్ల యూనిట్‌ను మంగళవారం అదనపు డీఆర్‌డీవో బోజప్ప, డీపీఎం నర్సింహ, ఏపీఎం రాములుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీవో శ్రీలత మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధికి చేయూతనందిస్తుందని పేర్కొన్నారు. పెరటి కోళ్లకు మార్కెట్‌లో డిమాండ్ ఉన్నందున మహిళా సంఘాలు యూనిట్లు ప్రారంభించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. మహిళా సంఘాల సభ్యులకు ఒక్కొక్కరికి 20కోడి పిల్లల చొప్పున 100 మందికి రుణం ఇస్తామని తెలిపారు. అనంతరం మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో రైతు వేదిక వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. రైతులు ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని సూచి ంచారు. కార్యక్రమంలో మహిళా సంఘం గ్రామ అధ్యక్షురాలు మీనాక్షి, సీసీ శ్రీలత, ధనలక్ష్మి, హైమవతి, నర్సింహ, సిబ్బంది విజేందర్, లక్ష్మి, జంగయ్య పాల్గొన్నారు.

టీ-శాట్ పాఠ్యాంశాలను సద్వినియోగం చేసుకోవాలి

● టీఎస్‌జీహెచ్‌ఎంఏ జిల్లా ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి

వికారాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): టీ-శాట్ నెట్‌వర్క్ ప్రసారం చేసే పాఠ్యాంశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని టీఎస్‌జీహెచ్‌ఎంఏ జిల్లాప్రధాన కార్యదర్శి కేశపల్లి రాంరెడ్డి సూచించారు. మంగళవారం టీ-శాట్ నెట్‌వర్క్, రాష్ట్ర గజిటెడ్ హెడ్‌మాస్టర్స్ అసోసియేషన్(టీ-ఎస్‌జీహెచ్‌ఎంఏ) ఆధ్వర్యంలో జెడ్పీ బాలుర పాఠశాలలో వివిధ అంశాలపై జిల్లా స్థాయి వ్యాస రచన, బాలవక్త, క్విజ్ పోటీలు నిర్వహించారు. మండల స్థాయి వ్యాస రచన, బాలవక్త, క్విజ్ పోటీల్లో మొదటి స్థానంలో నిలిచిన 60 మంది విద్యార్థులు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ, టీ-శాట్ ద్వారా ప్రసారమవుతున్న విద్యా విషయక కార్యక్రమాలను విద్యార్థులు వీక్షించేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలన్నారు. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా పాఠ్యాంశాలను రూపొందించారన్నారు. టీ-శాట్ నెట్‌వర్క్ ప్రసారం చేసే విద్యా విషయక అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకే టీ-శాట్ నెట్‌వర్క్, టీఎస్‌జీహెచ్‌ఎంఏ సంయుక్తంగా పోటీలు నిర్వహిస్తోందన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విజేతలను ప్రకటించారు. ఎంఈవో బాబూసింగ్, కొత్తగడి జీహెచ్‌ఎం వీరకాంతం, సబ్జెక్టుల నిపుణులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న రాంరెడ్డి

అందెశ్రీకి కన్నీటి వీడ్కోలు



అందెశ్రీ అంత్యక్రియలకు హాజరైన సీఎం, మంత్రులు, నాయకులు

(ఐదో పేజీ తరువాయి)

ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసు పక్కన ఉన్న హెచ్‌ఎండీఏ స్థలంలో నిర్వహించిన అందెశ్రీ అంత్యక్రియలకు సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు హాజరయ్యారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వాసులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అందెశ్రీ అమర్ రహే అంటూ నినాదాలు చేస్తూ అంతిమ యాత్రలో దారిపొడవునా పూల జల్లుతో నివాళులు అర్పించారు. దాదాపు 500 మంది కళాకారులు అంతిమ యాత్రలో పాల్గొని పాటలతో ఆయనకు ఘన నివాళులర్పించారు. ఘట్‌కేసర్ నుంచి ఎన్ఎఫ్‌సీనగర్ వెళ్లే రోడ్డుతో పాటు కాలనీల్లోని అందెశ్రీ ఇంటి వరకు గల రోడ్లను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా అంతిమ యాత్రలో మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, మేడ్చల్ జెడ్పీ మాజీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేశ్ యాదవ్, మున్సిపల్ మాజీ చైర్మన్ ముల్లి పావని, బోయపల్లి కొండల్‌రెడ్డి, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, పలువురు ప్రముఖులు ఆయన పార్థివ దేహానికి నివాళులు అర్పించారు.

పత్తి రైతుకు చిక్కు

(ఐదో పేజీ తరువాయి)

లేదని చెబుతున్నారు. అయితే జిల్లాలో 1,80,544.18 ఎకరాల్లో పత్తి సాగవుతోంది. దళారులు నేరుగా చేన్ల వద్దకే వెళ్లి క్వింటా పత్తికి రూ.6,500కు కొనుగోలు చేస్తున్నారని పలువురు రైతులు చెబుతున్నారు.

కొనుగోలు కేంద్రం లేక ఇబ్బందులు

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కపాస్ కిసాన్ యాప్ రైతులకు చుక్కలు చూపిస్తోంది. యాప్‌పై వ్యవసాయాధికారులు అవగాహన కల్పించినా యాప్ ద్వారా పత్తిని విక్రయించడానికి రైతులు ముందుకు రావడం లేదు. యాప్‌లో వివరాలను నమోదు చేయడం సమస్యగా మారిందని ఆవేదన చెందుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పత్తి పూర్తిగా తడిసి ముద్దయ్యింది. ఆ పత్తిని ఇంటి వద్ద ఆరబెట్టే వసతులు లేకపోవడంతో చేన్ల వద్ద ఆరబెట్టే పరిస్థితి లేదు. ఎప్పుడు వర్షం వస్తుందోనని ఆందోళన చెందుతున్న రైతులు ఆ పత్తిని దళారులకు విక్రయిస్తున్నారు. నియోజకవర్గ కేంద్రంలో పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని నాలుగేళ్లుగా రైతులు డిమాండ్ చేస్తున్నా మార్కెటింగ్ అధికారులకు, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులకు పట్టింపులేకుండా పోయిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గ కేంద్రంలో యాప్ లేకుండా కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి పత్తి కొనుగోళ్లు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



యాచారంలోని ఓ ఇంట్లో నిల్వ ఉన్న పత్తి

రవాణా ఖర్చులైనా మిగులుతాయని..

ఇటీవల కురిసిన వర్షాలకు తడిసిన పత్తిని ఆరబెట్టే వసతి లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఆమనగల్లు, పోలేపల్లి, షాద్‌నగర్, తదితర ప్రాంతాలకు చెందిన కొందరు దళారులు చేన్ల వద్దకే వచ్చి క్వింటాకు రూ.6,500 చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. అయితే పత్తిని ఆరబెట్టలేక, రవాణా ఖర్చు తప్పుతుందని దళారులకు విక్రయిస్తున్నామని పలువురు రైతులు చెబుతున్నారు. గతంలో హయత్‌నగర్ మండలంలోని సంఘీలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ కొనుగోలు కేంద్రంతో పత్తిని అమ్ముకునేందుకు రైతులకు కొంత వెసులుబాటు ఉండేది. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన యాప్, నిబంధనలతో పత్తిని విక్రయించడానికి రైతులు మొగ్గుచూపడం లేదు. పత్తి విక్రయించి రోజుల తరబడి నిరీక్షించడం కంటే దళారులకు అమ్మితే కొంతైనా నగదు చేతికందుతుందని రైతులు భావిస్తున్నారు.

నగదు చేతికందుతోంది



నేను ఐదు ఎకరాల్లో పత్తి సాగు చేసిన. రూ.మూడు లక్షల మేర ఖర్చయింది. కపాస్ కిసాన్ యాప్‌లో ఎలా స్లాట్ బుక్ చేసుకోవాలో తెలియదు. యాప్‌లో స్లాట్ బుక్ చేసుకునేందుకు రెండు గంటలపాటు ప్రయత్నించినా లాభం లేకుండాపోయింది. దళారులు నేరుగా వచ్చి నగదు చెల్లించి పత్తిని తీసుకెళ్తున్నారు. పత్తి తడిగా ఉన్నా కొంటున్నారు. పంట మొత్తాన్ని అమ్మితే పెట్టిన పెట్టుబడి మాత్రమే వస్తుందని అనుకుంటున్నా.

- కె.జంగయ్య, రైతు చౌదర్‌పల్లి

అవగాహన కల్పిస్తున్నాం



గ్రామాల్లో సిబ్బందితో వెళ్లి రైతులకు కపాస్ కిసాన్ యాప్‌పై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. అక్కడక్కడా రైతులు యాప్ ద్వారా స్లాట్ బుక్ చేసుకొని పత్తిని విక్రయిస్తున్నారు. కొంత మంది రైతులు దళారులకు విక్రయిస్తున్నారు. యాప్‌పై చాలా మందికి అవగాహన లేకనే దళారులకు పత్తిని అమ్ముకుంటున్నారు. ప్రతి ఒక్కరు వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటిస్తే బాగుంటుంది.

- రవినాథ్, యాచారం మండల వ్యవసాయాధికారి



సీసీ రోడ్డుపై పగుళ్లను పరిశీలిస్తున్న బక్కని నర్సింహులు

సీసీ రోడ్లు నాణ్యతతో వేయండి

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ పట్టణంలో వేస్తున్న సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బక్కని నర్సింహులు కోరారు. ఏడవ వార్డులోని అభిషేక్ ఆసుపత్రి నుంచి బక్కని నర్సింహులు నివాసం వరకు ఇటీవల వేసిన రోడ్డుపై పగుళ్లు ఏర్పడుతున్నాయని, రోడ్డుకిరువైపులా నివాసమున్నవారు మంగళవారం బక్కని దృష్టికి తీసుకెళ్లారు. ఈమేరకు ఆయన కాలనీ వాసులతో కలిసి రోడ్డును పరిశీలించి, మున్సిపల్ కమిషనర్ సునీత, రోడ్డు కాంట్రాక్ట్ పనులను పర్యవేక్షిస్తున్న అఫ్జల్‌తో మాట్లాడారు. రోడ్డు వేసే సమయంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. మున్సిపల్ అధికారులు సైతం పర్యవేక్షించాలని కోరారు. రోడ్లు వేయగానే లైన్లు కొట్టి, పరిపూర్ణంగా క్యూరింగ్ చేయాలని.. నాణ్యతలో రాజీపడకుండా అధికారులు పర్యవేక్షిస్తూ, పటిష్టంగా రోడ్లను వేయాలని కోరారు.

మాడ్గుల ఇన్‌చార్జి ఏఈగా గిరిబాబు

మాడ్గుల, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖ మండల ఇన్‌చార్జి ఏఈగా గిరిబాబు బాధ్యతలు చేపట్టారు. మాడ్గులలోని సబ్‌స్టేషన్‌లో ఏఈగా విధులు నిర్వహించిన శ్రీనివాస్ జీహెచ్ఎంసీకి బదిలీపై వెళ్లారు. మంగళవారం ఇన్‌చార్జి ఏఈగా గిరిబాబు బాధ్యతలు చేపట్టారు. ఏడీఈ బాలకృష్ణారావు, తలకొండపల్లి ఏఈ విజయకుమార్, సిబ్బంది ఆయన్ను సన్మానించారు.

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు



ఆమనగల్లు : మాట్లాడుతున్న గంప వెంకటేశ్

ఆమనగల్లు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని డీసీసీబీ డైరెక్టర్, ఆమనగల్లు పీఏసీఎస్ చైర్మన్ గంప వెంకటేశ్ అన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని కోరారు. ఆమనగల్లు పీఏసీఎస్ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ధాన్యానికి ప్రభుత్వం క్వింటాలుకు రూ.2,369 మద్దతు ధర కల్పించిందన్నారు. సన్నరకం వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ అందిస్తున్నట్లు చెప్పారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయడం జరుగుతుందన్నారు. ఆమనగల్లు మార్కెట్ యార్డులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ గీతా నర్సింహా, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు. రైతులు, మార్కెట్, పీఏసీఎస్ డైరెక్టర్లు, నాయకులు హాజరై విజయవంతం చేయాలన్నారు. పీఏసీఎస్ వైస్‌చైర్మన్ సత్యం, పీఏసీఎస్ సీఈవో దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

కడ్తాల్ : మండల కేంద్రంలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం అదనపు డీఆర్‌డీవో బోజప్ప సందర్శించారు. కొనుగోళ్లు వేగవంతం చేయాలని నిర్వాహకులకు సూచించారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాలన్నారు. చివరి ధాన్యం గింజ వరకూ కొనుగోలు చేస్తామనేఇ ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం రాములు, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కుమారి, సీసీలు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలి

● అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి



పత్తిలో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న చంద్రారెడ్డి

షాద్‌నగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తున్న పంట ఉత్పత్తుల కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన షాద్‌నగర్ పరిధిలోని పంట కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులు పండించిన పంటలను కొనుగోలు చేసే విషయంలో ఎలాంటి ఇబ్బందులకు గురి చేయకూడదని అధికారులను ఆదేశించారు. ధాన్యానికి సంబంధించి ప్రతీ కొనుగోలు కేంద్రంలో ధాన్యానికి సరిపడా గన్నీ బ్యాగులను అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈమేరకు రైస్‌మిల్లులకు రోజుకు ఎన్ని లోడ్ల లారీలు వెళ్తున్నాయి? వివరాలను ట్యాబ్‌లో నమోదు చేస్తున్నారా? లేదా? అని అధికారులను ప్రశ్నించారు. ధాన్యం సేకరణ పూర్తయిన తర్వాత కొనుగోలు కేంద్రాలను మూసివేసే ముందు ట్రక్ షీట్లు, తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. 15 శాతానికి లోబడి తేమ ఉన్న ధాన్యాన్ని రైతులు మార్కెట్‌కు తెచ్చిన వెంటనే ఎలాంటి కాలయాపన చేయకుండా తూకం జరిపించి రషీదులు ఇవ్వాలని ఆదేశించారు. ఫార్మా పరిసర ప్రాంతాల్లోని నీటి భూముల్లో పండించిన పంటలను ఈ ఏడాది మాత్రమే కొనుగోలు చేయాలని అధికారులకు తెలిపారు. అనంతరం పత్తి కొనుగోలుకు సంబంధించిన వివరాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ అధికారి వనజాత, డీఎంవో హరీశ్, వ్యవసాయాధికారి ఉష తదితరులు పాల్గొన్నారు.

అబుల్ కలాం ఆజాద్ చిరస్మరణీయులు



కడ్తాల : అబుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేస్తున్న జహంగీర్‌బాబా, నాయకులు

కడ్తాల్/ఆమనగల్లు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమర యోధుడు, భారత తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిరస్మరణీయులని నాయకులు అన్నారు. ఆయన జయంతి, జాతీయ విద్యా దినోత్సవాలను కడ్తాల మండల కేంద్రంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకుడు, మండల మాజీ కో-ఆప్షన్ సభ్యుడు జహంగీర్ బాబా ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అబుల్ కలాం చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఆసుపత్రుల్లో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. పట్టణంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వేణుగోపాల్, ఎంపీటీసీ గురిగళ్ల లక్ష్మయ్య, నాయకులు అస్గర్‌అలీ, భరత్ యాదవ్, భానుకిరణ్, తుప్పరి మహేశ్, మోత్యానాయక్, బన్ని తదితరులు పాల్గొన్నారు. అలాగే అబుల్ కలాం అజాద్ జయంతిని ఆమనగల్లు పట్టణంలో ఘనంగా నిర్వహించారు. కేఎన్ఆర్ సేవా దళం అధ్యక్షుడు బాబా, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కార్యదర్శి ఫరీద్‌ల ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అబుల్ కలాం చిత్రపటానికి నివాళులర్పించారు. నాయకులు అవ్వారి శివలింగం, కండె సాయి, పరమేశ్, ఎంఏ ఖలీం, ఇ మ్రాన్, కరీం, కొండల్ రెడ్డి, శ్రీను, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.



ఆమనగల్లు : నివాళులర్పిస్తున్న బాబా, ఫరీద్, నాయకులు

బాల్య వివాహాలను అరికట్టాలి



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీడీపీవో శాంతిశ్రీ

కందుకూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి: బాల్యవివాహాలు చట్టపరంగా నేరమని, వాటిని అరికట్టేందుకు ప్రతీ ఒక్కరు చైతన్యం కావాలని మహేశ్వరం ఐసీడీఎస్ సీడీపీవో శాంతిశ్రీ సూచించారు. మంగళవారం మండల కేంద్రం(కొత్తగూడ) లోని కస్తూర్బాగాంధీ బదిరుల పాఠశాలలో బాల్యవివాహాల నిరోధక చట్టంపై నిర్వహించిన సదస్సుకు ఆమె హాజరై మాట్లాడారు. బాలికలు 18 సంవత్సరాలు, బాలురు 21సంవత్సరాలు నిండిన తరువాతనే వివాహం చేసుకోవాలన్నారు. చిన్న వయస్సులో వివాహాలు చేయడం వల్ల అనేక సమస్యలు వస్తాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు సీడీపీవో బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సబిత, ప్రిన్సిపాల్ తీగల భార్గవి, టీచర్లు స్వాతి, కల్పన తదితరులు పాల్గొన్నారు.

మొలకెత్తని 'బీట్‌రూట్' వివరాల సేకరణ



బీట్‌రూట్ విత్తిన భూమిని పరిశీలిస్తున్న శంకర్‌లాల్

చేవెళ్ల, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మొలకెత్తని బీట్‌రూట్ విత్తన వివరాలను సేకరించి ఉన్నతాధికారులకు నివేదిస్తామని మండల వ్యవసాయ అధికారి శంకర్‌లాల్ తెలిపారు. మంగళవారం చేవెళ్ల మండలంలోని కందవాడ గ్రామంలో రైతులు సాగుచేసిన బీట్‌రూట్ పంట పొలాన్ని వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా శంకర్‌లాల్ మాట్లాడుతూ మహికో కంపెనీకి చెందిన విత్తనాలు సరిగ్గా మొలకెత్తలేదని రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పంటపొలాన్ని సందర్శించినట్లు చెప్పారు. చేవెళ్లలో రైతులు కొనుగోలు చేసిన ఫర్టిలైజర్ షాపులో రికార్డులు తనిఖీ చేసినట్లు తెలిపారు. ఈమేరకు పూర్తిస్థాయి నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించండి

మొయినాబాద్ రూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని హిమాయత్‌నగర్ వార్డులోని శాంతి యువజన సంఘం ఆవరణలో విద్యుత్ సమస్యలున్నాయని, వెంటనే పరిష్కరించాలని ఆ సంఘం సభ్యులు మంగళవారం మండల విద్యుత్ అధికారి శివరామకృష్ణను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. సంఘం ఆవరణలో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా వేలాడుతున్నాయని.. తొలగించాలని కోరారు. అలాగే పలు అభివృద్ధి పనులు నిర్వహించేందుకు విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని కోరారు. సంఘం అధ్యక్షుడు కుమ్మరి విఠల్, ఉపాధ్యక్షుడు సురేశ్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి వడ్ల కలిదాస్ చారి, ముదిగొండ పవన్‌కుమార్ యాదవ్ తదితరులు ఉన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

కడ్తాల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గోవిందాయిపల్లి తండాలోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయ అభివృద్ధికి నాయకుడు మల్లేశ్ నాయక్ రూ.10 వేలు విరాళం ప్రకటించారు. మంగళవారం స్థానిక నాయకులు, హనుమాన్ భక్తుల సమక్షంలో ఆలయ నిర్వాహకులకు నగదు అందజేశారు. ఆలయంలో పెయింటింగ్ పనుల కోసం విరాళం అందించిన మల్లేశ్ నాయక్‌ను స్థానికులు అభినందించారు. గౌతమ్, రతన్, హరి, గోపి, కళ్యాణ్, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



బహుమతులు అందిస్తున్న ఎంఈవో అక్బర్

శంకర్‌పల్లి, నవంబరు 11 (ఆంధ్ర జ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని శంకర్‌పల్లి ఎంఈవో అక్బర్ తెలిపారు. మంగళవారం మండలంలోని జన్వాడ గ్రామ ప్రభుత్వ పాఠశాలలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బాలబాలికలకు అండర్ 14, 17 విభాగాల్లో జోనల్ స్థాయి ఖోఖో పోటీలు నిర్వహించారు. చేవెళ్ల మండల విద్యార్థులు ప్రథమ స్థానం, శంకర్‌పల్లి మండల విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారు. గెలుపొందిన వారికి ట్రోఫీ, మెడల్స్‌ను ఎంఈవో ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జోనల్ స్థాయిలో సత్తా చాటిన విద్యార్థులు త్వరలో జరిగే జిల్లాస్థాయి పోటీలకు వెళ్లనున్నట్లు చెప్పారు. జోనల్ సెక్రటరీ ప్రభాకర్, పీడీలు పాల్గొన్నారు.

వైద్యశిబిరాల ఏర్పాటు అభినందనీయం

మొయినాబాద్ రూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని మండల కాంగ్రెస్ పార్టీ నాయకుడు అవిశెపేట ఆంజనేయులు గౌడ్ అన్నారు. చిన్నమంగళారంలో నగరంలోని ఏజీజీ ఆసుపత్రి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన శిబిరంలో గ్రామస్థులకు లివర్ స్కానింగ్, రక్త, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి మందు లందించారు. వైద్యసిబ్బంది తదితరులు న్నారు.

బాంబు పేలుడు ఘటన నిందితులను కఠినంగా శిక్షించాలి

ఆదిభట్ల/చేవెళ్ల, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో బాంబు పేలుడుకు ఘటనకు కారణమైన నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని టీడీపీ జిల్లా నాయకులు మెట్టు దామోదర్‌రెడ్డి కేంద్రం ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం బొంగ్లూర్ గేట్ వద్ద బాంబు దాడిలో మరణించిన మృతులకు సంతాపం ప్రకటించి దాడిని నిరసిస్తూ నిరసన చేపట్టారు. టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి, నాయకులు బుగ్గరాములు, వాసు, బీజేపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, కృష్ణగౌడ్, తదితరులున్నారు. కాగా, ఢిల్లీలో బాంబు పేలుడు సంఘటన బాధాకరమని సీపీఐ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా సీనియర్ నాయకుడు ఎం.ప్రభులింగం అన్నారు. మంగళవారం చేవెళ్లలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బాంబు పేలుడులో చనిపోయిన వారికి రూ.కోటి పరిహారంతో పాటు గాయపడిన వారికి రూ.50 లక్షలు ఇవ్వాలన్నారు. పేలుళ్లకు పాల్పడిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



నిరసన తెలుపుతున్న టీడీపీ, బీజేపీ శ్రేణులు

ఘనంగా రాజశేఖర్‌రెడ్డి జన్మదిన వేడుకలు



పెద్దమ్మతల్లి ఆలయంలో మాజీ ఎంపీటీసీ రాజశేఖర్‌రెడ్డితో కలిసి పూజల్లో పాల్గొన్న సబితా ఇంద్రారెడ్డి

కందుకూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కందుకూరు మాజీ ఎంపీటీసీ, ఎంపీటీసీల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు ఎస్.రాజశేఖర్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈమేరకు మంగళవారం మండలంలోని కొత్తూరు గేటు వద్ద గల పెద్దమ్మతల్లి దేవాలయం సమీపంలో వేడుకలు నిర్వహించారు. మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి హాజరై రాజశేఖర్‌రెడ్డిని ఆశీర్వదించారు. కార్యక్రమంలో ప్యాక్స్ మాజీ చైర్మన్ ఎస్.చంద్రశేఖర్, మాజీ సర్పంచ్‌లు రామకృష్ణారెడ్డి, పరంజ్యోతి, గోపాల్‌రెడ్డి, నరేందర్‌గౌడ్, కె.సదానంద్ గౌడ్, పున్న భిక్షపతి, ఎస్.సత్యనారాయణరెడ్డి, భూపాల్‌రెడ్డి, జంగయ్య, మాజీ ఎంపీటీసీలు సురేశ్, టి.ఇందిరా దేవేందర్, బీఆర్ఎస్, బీజేపీ మండల శాఖ అధ్యక్షులు మన్నె జయేందర్ ముదిరాజ్, నిమ్మ అంజిరెడ్డి, నాయకులు కాకి దశరథ, ఎలుక మేఘనాథ్‌రెడ్డి, ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి, బర్కం వెంకటేశ్, హన్మంత్‌రెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, ప్రశాంత్ చారి, ఎగ్గిడి సత్తయ్య, దామోదర్‌గౌడ్, ఎగిరిశెట్టి నరేశ్, మల్లేశ్, చంద్రశేఖర్, జి.రామకృష్ణ, బి.దీక్షిత్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, ఎగ్గిడి జగదీశ్, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ప్రతీ వ్యక్తి బీమా చేయించుకోవాలి

యాచారం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రతీ వ్యక్తి విధిగా ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి కింద బీమా చేయించుకోవాలని యాచారం ఎస్బీఐ మేనేజర్ మాన్య నాయక్ సూచించారు. ఇటీవల యాచారం గ్రామానికి చెందిన కేశమోని దశరథ గౌడ్ మృతిచెందాడు. ఈమేరకు ఆయన భార్య యాదమ్మకు మంగళవారం బీమా కింద రూ.2లక్షల చెక్కు అందించారు. జీవన్‌జ్యోతి బీమాపై ఖాతాదారులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. బ్యాంక్ అనేక బీమా పథకాలు అమలు చేస్తుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది ఈశ్వర్ రావు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల కమిటీ

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): తెలంగాణ గుర్తింపు పాఠశాలల యాజమాన్య అసోసియేషన్ షాద్‌నగర్‌శాఖను మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈమేరకు కమిటీ అధ్యక్షుడిగా కె.వంశీకృష్ణ, ఉపాధ్యక్షుడిగా రిజ్వాన్, ప్రధాన కార్యదర్శిగా పి.ఆనంద్, కోశాధికారిగా స్వాతిరెడ్డి, సంయుక్త కార్యదర్శిగా భీమ్‌శంకర్, గౌరవ సలహాదారులుగా ఎన్‌కే రాజేంద్రప్రసాద్, డీవీఎన్ స్వామిలను ఎన్నుకున్నట్లు కమిటీ నూతన అధ్యక్షుడు వంశీకృష్ణ తెలిపారు.

సీఎంఆర్ఎఫ్.. పేదలకు వరం

ఆదిభట్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం లాంటిదని మున్సిపల్ మాజీ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన నివాసంలో ఎంపీ పటేల్‌గూడకు చెందిన బోడిగె బుగ్గమ్మ, మంచాల వెంకటేశ్వర తండాకు చెందిన కళావతికి మంజూరైన రూ.1.20 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ వైద్యపరంగా ఆపదలో ఉన్నవారికి సకాలంలో చికిత్స నిమిత్తం సీఎం సహాయనిధి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఉదయ్‌పాల్‌రెడ్డి, జంగయ్య, రాజు ఉన్నారు.

క్రైం కార్నర్

టైల్స్ మేస్త్రీ దారుణ హత్య

కొత్తూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వింటేజ్ కాలనీలో ఓ నూతన గృహంలో శ్యాంశుల్(30) అనే టైల్స్ మేస్త్రీ దారుణ హత్యకు గురయ్యాడు. ఇన్‌స్పెక్టర్ నర్సయ్య తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్‌కు చెందిన శ్యాంశుల్ కొంత కాలంగా కొత్తూర్‌లో టైల్స్ మేస్త్రీగా పని చేస్తున్నాడు. వింటేజ్ కాలనీలోని నూతన గృహంలో పనులు చేసి సోమవారం రాత్రి అక్కడే పడుకున్నాడు. అర్ధరాత్రి దాటిన తర్వాత గుర్తుతెలియని వ్యక్తి బండరాయితో శ్యాంశుల్ తలపై దాడిచేసి హత్య చేసి పరారయ్యాడు. శ్యాంశుల్ బంధువైన సద్దాం మంగళవారం ఉదయం పని నిమిత్తం అక్కడికి వెళ్లగా అతడు రక్తపుమడుగులో పడి ఉండడంతో పోలీసులకు సమాచారం ఇచ్చాడు. వెంటనే వారు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. క్లూస్‌టీం, ఫింగర్ ప్రింట్స్, డాగ్ స్క్వాడ్ బృందాలు ఆధారాలను సేకరించారు. మృతదేహాన్ని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. సద్దాం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ట్విస్ట్

● బొలెరో వాహనం ఢీకొట్టడంతోనే బైకిస్ట్ మృతి

కేశంపేట, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన సంఘటనలో ట్విస్ట్ చోటుచేసుకుంది. మృతుడి కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేసినట్లే వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు గుర్తించారు. వివరాలోకి వెళితే.. పాపిరెడ్డిగూడ గ్రామానికి చెందిన అబ్బి మల్లేశ్(45) సోమవారం ఉదయం 8గంటల సమయంలో బైక్‌పై కేశంపేట వెళ్లి అక్కడి నుంచి కాకునూర్‌కు వెళ్తుండగా మార్గమధ్యలో చంద్ర గార్డెన్ సమీపంలో ముందు వెళ్తున్న సైకిల్‌ను తప్పించబోయాడు. అదే సమయంలో ఎదురుగా వచ్చిన బొలెరో వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. అయితే, మొదట మల్లేశ్ బైక్‌పై నుంచి కిందపడి మృతిచెందినట్లు పోలీసులు భావించారు. కానీ, మృతుడి కుటుంబ సభ్యులు వాహనం ఢీకొట్టడంతోనే మృతిచెంది ఉంటాడని పోలీసులకు తెలిపారు. దాంతో కేశంపేట సీఐ నరహరి, ఎస్సై రాజ్‌కుమార్‌లు ఆ మార్గంలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. ప్రమాద సమయానికి ఓ బొలెరో వాహనం అటుగా వెళ్లినట్లు గుర్తించారు. దానిపై యాదాద్రి ట్రావెల్స్ అని ఉండడం గమనించారు. అయితే, వాహనం కేశంపేటకు చేరుకోకపోవడంతో కొండారెడ్డిపల్లిలో సీసీ కెమెరాలను పరిశీలించి, కాకునూర్ గ్రామానికి చెందిన సూరమోని దశరథంనకు చెందినదిగా గుర్తించారు. పోలీసులు అదేరోజు రాత్రి 10 గంటలకు కాకునూర్‌లో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. దశరథంను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నేరం అంగీకరించినట్లు సీఐ వివరించారు. శవపరీక్ష అనంతరం మంగళవారం మృతదేహాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు.

ఎదురెదురుగా ట్రాక్టర్-ఆటో ఢీ..

ఒకరి మృతి.. మరొకరికి గాయాలు

తలకొండపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకట్రావుపేట గేటు సమీపంలో ట్రాక్టర్, ఆటో ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతిచెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన కథనం మేరకు.. వెంకట్రావుపేటకు చెందిన పోలే రాములు(48) మంగళవారం సాయంత్రం ట్రాక్టర్ ఇంజన్ నడుపుకుంటూ ఆమనగల్లు వైపు వెళ్తున్నాడు. అదే సమయంలో చుక్కాపూర్ గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ కాలూరి వీరేశ్ కూలీలను తీసుకువచ్చేందుకు ఆటో నడుపుకుంటూ వెంకట్రావుపేటకు వెళ్తున్నాడు. వెంకట్రావుపేట చౌరస్తా వద్ద ట్రాక్టర్, ఆటో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ట్రాక్టర్ అదుపు తప్పి రోడ్డు పక్కన గోతిలో పడిపోవడంతో డ్రైవర్ పోలే రాములు అక్కడిక్కడే మృతిచెందాడు. వీరేశ్ తీవ్రంగా గాయపడగా.. సమీపంలోని ఎన్నం ఆసుపత్రికి తరలించారు. మృతుడు పోలే రాములు వెంకట్రావుపేట పంచాయతీ ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేసేవాడు. అతడికి భార్య పద్మమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శేఖర్ తెలిపారు.

స్కూటీ స్కిడ్.. ఫొటోగ్రాఫర్ మృతి

యాచారం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): సాగర్-హైదరాబాద్ ప్రధాన రహదారి చౌదర్‌పల్లి గేటు వద్ద స్కూటీ స్కిడ్ కావడంతో ఫొటోగ్రాఫర్ దుర్మరణం చెందాడు. చౌదర్‌పల్లికి చెందిన గోలి వెంకటేశ్(40) వృత్తి రీత్యా ఫొటోగ్రాఫర్. మంగళవారం రాత్రి యాచారం నుంచి స్వగ్రామానికి స్కూటీపై వెళుతుండగా చౌదర్‌పల్లి గేటు సమీపంలో స్కిడ్ కావడంతో తలకు తీవ్రగాయాలై అక్కడకక్కడే దుర్మరణం చెందాడు. మృతదేహాన్ని ఇబ్రహీంపట్నం సివిల్ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రియాంక చెప్పారు.

గుండెపోటుతో వ్యక్తి..

శంషాబాద్ రూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో వ్యక్తి మృతిచెందిన సంఘటన శంషాబాద్ మండలంలో చోటుచేసుకుంది. సీఐ నరేందర్‌రెడ్డి కథనం మేరకు.. శంషాబాద్ మండలంలోని సంగిగూడకు చెందిన మొహ్మద్ అంబర్ అలీ(32) స్వగ్రామం బిహార్ నుంచి ఏడాది క్రితం హైదరాబాద్‌కు వలస వచ్చాడు. 5 నెలలుగా అంబర్ అలీ సంగిగూడలో అద్దె ఇంట్లో ఒంటరిగా ఉంటూ క్రేన్ ఆపరేటర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం అంబర్ అలీ అమ్మ ఖుర్షిదా ఖాతూన్‌కు ఫోన్ చేసి ఛాతిలో నొప్పి వస్తుందని ఇంటి యజమాని వెంకటేశ్ తెలిపాడు. అనంతరం శంషాబాద్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించి.. తరువాత ఉస్మానియాకు తరలించారు. అక్కడ వైద్యులు ఆయనను పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ సంఘటనపై మృతుడి కుటుంబ సభ్యులు మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

'ఉపాధి' పనులను వినియోగించుకోవాలి

కేశంపేట, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): గ్రామాలలోని కూలీలు ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని, 2026-27 సంవత్సరానికి గాను పనులను గుర్తించాలని కేశంపేట ఎంపీడీవో రవిచంద్రకుమార్ రెడ్డి సూచించారు. మండల పరిధిలోని నిర్ధవెల్లి గ్రామంలో మంగళవారం జాతీయ ఉపాధి హామీ పనుల గుర్తింపు కోసం గ్రామసభ నిర్వహించారు. ఈమేరకు కూలీలకు ఎక్కువ పనిదినాలు కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఈ పథకాన్ని రైతులు ఉపయోగించుకోవాలన్నారు. ఫార్మేషన్ రోడ్లు, చెరువు కట్టలపై ఉండే మొక్కల తొలగింపు పనులు ఎక్కువ మంది కూలీలకు ఉపయోగపడుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఏ నీలకంఠబాబు, కార్యదర్శి వినయ్, ఫీల్డ్ అసిస్టెంట్ జంగయ్య, ప్యాక్స్ డైరెక్టర్ కృష్ణయ్య, జంగయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

కొందుర్గు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపుల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని కొందుర్గు ఎస్సై రవీందర్ నాయక్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లోని విద్యార్థులకు ప్రివెన్షన్ ఆఫ్ సెక్సువల్ అరాస్మెంట్ (పీఓఎస్‌హెచ్), చిల్డ్రన్స్ ఫ్రమ్ సెక్సువల్ అఫెన్స్ ఆఫ్-2012 అనే అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌దే విజయం



మాట్లాడుతున్న మండ్లి రాములు

ఆమనగల్లు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ ఘన విజయం సాధిస్తుందని జిల్లా సీనియర్ నాయకుడు, చెంచు యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మండ్లి రాములు ధీమా వ్యక్తం చేశారు. అన్ని ఎగ్జిట్ పోల్స్ సర్వేలు కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉన్నాయన్నారు. ఆమనగల్లు పట్టణంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ఎన్ని విషప్రచారాలు చేసినా ప్రజలు కాంగ్రెస్ పార్టీనే ఆదరించారన్నారు. కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డి ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.